సాక్షి
ప్రకాశం
గురువారం । 23 । జనవరి । 2025



రొయ్యో..మొర్రో..
నాసిరకం మోనోడాన్ రొయ్యపిల్లలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. లక్షలు వెచ్చించి కొన్న రెండు నెలలకే ఈహెచ్‌పీ వైరస్‌తో దెబ్బతిన్నాయి. - 8లో..



కూలీల ఆటో బోల్తా
కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతిచెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలైన ఘటన పామూరు మండలం బొట్లగూడూరు వద్ద జరిగింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
31/19

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జంప్‌రోప్‌లో కొండపి విద్యార్థినులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్, ఎంపీ

కొండపి: జనవరి 7, 8 తేదీల్లో నేపాల్ లోని పొఖారా రంగస్థల స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ జంప్ రోప్ గ్రూప్ ఈవెంట్ లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన కే.లక్ష్మీ ప్రణతి, ఏ.కావ్య బంగారు పతకాలు సాధించారు. వ్యక్తిగత విభాగంలో ఏ.కావ్య బ్రాంజ్ మెడల్ సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన ఏ.కావ్య, కే.లక్ష్మీ ప్రణతిలను ఒంగోలు కలెక్టరేట్ లో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ, పీఈటీ భార్గవి, శిరోమణి, గురుకుల సిబ్బంది పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్ఎస్ఏ నూతన కార్యవర్గం



కలెక్టర్ కు మొక్క అందజేస్తున్న రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఒంగోలు అర్బన్: నూతనంగా ఎంపికైన ఏపీఆర్ఎస్ (ఏపీ రెవెన్యూ అసోసియేషన్) అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక మధుసూదన్‌రావు, ఆర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అధికారులు, ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, రెవెన్యూ శాఖలో న్యాయపరమైన సమస్యలు ఉంటే పరిశీలించి తప్పక పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నూతన కార్యవర్గ నాయకులు ఊతకోలు శ్రీనివాసరావు, ఏవీ రవిశంకర్, కాశయ్య, ఎస్‌వీవీ రాజేష్, వీ కిరణ్‌కుమార్, రామశర్మ, రామనారాయణరెడ్డి, కిషోర్ కుమార్, సాయి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ఆంజనేయులు, ప్రశాంత్ నాయుడు పాల్గొన్నారు.


25న మద్దిపాడులో జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: మద్దిపాడులో ఈ నెల 25న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి జే రవితేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిపాడులోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో రిలయన్స్ డిజిటల్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, తారిక మేనేజ్‌మెంట్ సర్వీసెస్, శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు వివిధ ఉద్యోగ అవకాశాలు అందిస్తున్నాయన్నారు. విద్యార్హతలను బట్టి వేతనం ఉంటుందన్నారు. ఇతర పూర్తి వివరాలకు ఎస్‌కె బాషా 9963005209 అనే నెంబరుపై సంప్రదించాలన్నారు.

24న పోస్టల్ మేళా

ఒంగోలు వన్‌టౌన్: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పోస్టల్ కార్యాలయాల్లో ఈనెల 24వ తేదీ సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిచేందుకు ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాదిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న బాలికలకు ఈ ఖాతాను రూ.250లతో ప్రారంభించవచ్చని, ఒక ఆర్థిక సంవత్సరానికి రూ.1,50,000 వరకూ ఖాతాలో జమ చేసుకోవచ్చన్నారు. ఖాతా ప్రారంభించినప్పటి నుంచి 14 సంవత్సరాల పాటూ నగదు జమ చేయవచ్చని ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలని తెలిపారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండితే ఉన్నత విద్యకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉన్న మొత్తంలో 50 శాతం వరకూ నగదు ఉపసంహరించుకోవచ్చన్నారు. వివాహం నిమిత్తం నెల రోజుల ముందు కానీ, వివాహానంతరం మూడు నెలలోపు కానీ ఖాతాను మూసివేసి, అప్పటి వరకూ జమ అయిన మొత్తాన్ని తీసుకునే సదుపాయం ఉందన్నారు. ఈ ఖాతాలను ఏ తపాలా కార్యాలయానికి అయినా బదిలీ చేసుకోవచ్చన్నారు. ఖాతాను ప్రారంభించడానికి బాలిక జనన ధ్రువీకరణ పత్రం, బాలిక, సంరక్షకుని పాస్‌పోర్టు సైజు ఫొటోలు మూడు, బాలిక ఆధార్ కార్డు, సంరక్షకుని గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ పత్రాలతో ఖాతాను ప్రారంభిస్తామన్నారు.

కూటమిలో పైకి అంతా బాగానే కనిపిస్తున్నా లోలోపల మంటలు చెలరేగుతున్నాయి. టీడీపీ – జనసేన పార్టీల అధినేతల దగ్గర నుంచి కింది స్థాయి కేడర్ వరకూ చేస్తున్న ప్రకటనలే అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. కొండపి నియోజకవర్గంలో బియ్యం, ఇసుక, మద్యం అక్రమాలపై గ్లాసు పార్టీ నేతలు చేసిన కామెంట్స్ సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. అవసరమైతే గ్రామస్థాయిలో పర్యటించి పోరాటం సాగిస్తామని హెచ్చరికలు జారీ చేయడంపై టీడీపీ నాయకులు లోలోపల రగిలిపోతున్నారని సమాచారం. జిల్లాలో ప్రస్తుతం ఇది హాట్ టాపిక్‌గా మారింది.



తమ్ముళ్లు తెగబడి.. సేన తిరగబడి..!

- కొండపిలో టీడీపీ–జనసేన మధ్య కోల్డ్‌వార్
- బియ్యం, ఇసుక, గ్రావెల్ అక్రమాలపై పోరు
- గ్రామస్థాయిలో పర్యటిస్తామంటూ జనసేన నేతల హెచ్చరిక
- టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే బియ్యం, ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపు ఆరోపణలు
- హాట్ టాపిక్‌గా గ్లాసు నేతల ప్రకటనలు
- జనసేన నేతలతో శ్రుతి కలిపిన టీడీపీ అసమ్మతి నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అధికారంలోకి వచ్చి ఇంకా సంవత్సరం కూడా పూర్తి కాలేదు. అప్పుడే కూటమి పార్టీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. కొండపి నియోజకవర్గంలో అక్రమాలపై పోరాడతామంటూ జనసేన నాయకులు హుకుం జారీ చేస్తుండటం తీవ్రచర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ పెద్దలకు చెడ్డ పేరు తెస్తే ఊరుకోమని చేసిన ప్రకటనలతో టీడీపీ, జనసేన పార్టీల్లో అలజడి రేగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో బియ్యం, రేషన్, గ్రావెల్, మద్యం అక్రమాలకు సంబంధించి టీడీపీ నాయకులపై పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరు చేస్తున్న ప్రకటనలు ముందు ముందు ఎలాంటి మలుపులు తీసుకుంటాయోనని సర్వత్రా చర్చ జరుగుతోంది.

దోపిడీకి కేరాఫ్ అడ్రస్ టీడీపీ...

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసిన వెంటనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిసిన మరుక్షణం నుంచే కొండపి నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్, బియ్యం అక్రమ రవాణాకు తెరలేపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరుగుతున్నాయంటూ నానా యాగి చేసిన టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చాక భారీగా అక్రమాలకు తెరతీయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరి మాయమాటలు నమ్మి ఓట్లేసి ఎంత తప్పు చేశామా.. అని ఆ రోజే వారు బేరీజు వేసుకోవటం ప్రారంభించారు.

అలజడి రేపుతున్న సేన ప్రకటనలు...

నియోజకవర్గంలో ఇసుక, రేషన్ బియ్యం, మట్టి అక్రమాలను జనసేన పార్టీ అడ్డుకుంటోంది. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే జనసేన పార్టీ చూస్తూ ఊరుకోదంటూ చేస్తున్న ప్రకటనలు అలజడి రేపుతున్నాయి. తొలుత పొన్నలూరులో పర్యటించామని, త్వరలో పొన్నలూరు మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకుంటామని, సమస్యలతో పాటు అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు. ముఖ్యంగా కొండపి నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక, రేషన్ బియ్యం, మట్టి తరలిస్తే జనసేన పార్టీ కచ్చితంగా అడ్డుకుంటుందన్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని జనసేన నాయకులు హెచ్చరికలు చేస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది. జనసేన నాయకుల ప్రకటనలు సోషల్ మీడియాలోని అన్ని గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలో ఇసుక, రేషన్ బియ్యం, మట్టి దందాలకు పాల్పడుతోంది ముమ్మాటికీ టీడీపీ నాయకులేనని, వారి కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని టీడీపీలోని వ్యతిరేక వర్గం ఆరోపిస్తోంది. దీంతో జనసేన, టీడీపీ వ్యతిరేక వర్గం ఒక్కటైతే మన పరిస్థితి ఏంటని అక్రమార్కులు తర్జనభర్జనలు పడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

☛ కొండపి నియోజకవర్గంలో ఇసుక లభ్యమయ్యే జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లో రేయింబవళ్లు తేడా లేకుండా జేసీబీల సహాయంతో ఇసుక, గ్రావెల్ తవ్వకాలు చేసి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా అక్రమ రవాణా ప్రారంభించారు. సింగరాయకొండలో గ్రావెల్ అక్రమ రవాణా చేస్తూ మమ్మల్ని ఆపే దమ్ము ఎవరికి ఉందంటూ బహిరంగంగానే అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. సింగరాయకొండ మండలంలోని పాత సింగరాయకొండ, శానంపూడి ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వీరిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు.

☛ పొన్నలూరు మండలం వేంపాడు గ్రామ పరిధిలోని పాలేరు నదిలో ఇసుక తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు.

☛ జరుగుమల్లి మండల కేంద్రంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న సమయంలో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో ట్రైనీ ఇన్‌స్పెక్టర్ వచ్చి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. దీనిపై మంత్రి రంగప్రవేశం చేశారు. ట్రాక్టర్లను వదిలేయాలంటూ పోలీసులను ఆదేశించారు. వెంటనే వాహనాలను పంపేశారు.

☛ సింగరాయకొండ మండలం శానంపూడిలో ఉలవపాడు గ్రామానికి చెందిన శ్రీనీలకంఠేశ్వర దేవస్థానం భూమిలో టీడీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అనుచరులు, బంధువులు అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా దేవదాయశాఖ అధికారులు టిప్పర్లను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేయించి జరిమానా విధించారు. ఇది అప్పట్లో సంచలనంగా మారింది.

☛ జరుగుమల్లి మండలం చతుకుపాడు పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తుండగా సెబ్ ఎస్ఐ అడ్డుకునే ప్రయత్నం చేసినప్పుడు అతనిపై దాడికి యత్నించారు.

నియోజకవర్గంలో అడపాదడపా ట్రాక్టర్లు పట్టుకుంటున్నా అధికార పార్టీ పెద్దల ఫోన్లతో అవి స్టేషన్ నుంచి దర్జాగా బయటకు వెళ్లిపోతున్నాయి.

పెరిగిన ఇసుక, గ్రావెల్ ధరలు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకుల అక్రమ దందాతో ఇసుక, గ్రావెల్ ధరలు అమాంతం పెరిగాయి. పార్టీ పెద్దలకు వాటాలు ఇవ్వాలంటూ ట్రాక్టరు ఇసుక ధర రూ.4,500 కు పెంచారు. టిప్పర్ ధర 18 టన్నులు రూ.25 వేలకు అమ్మారు. తరువాత ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తామంటూ ఇసుక యార్డులు ఏర్పాటు చేసి టన్ను రూ.375 కు అమ్మే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో టీడీపీ నాయకులు అక్రమంగా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా అధికారుల అండతో ఇసుక దోచేశారు. నేటికీ కె.బిట్రగుంట, కామేపల్లి, చింతలపాలెం, చతుకుపాడు, సింగరాయకొండ మండలం శానంపూడి, పొన్నలూరు మండలంం వేంపాడు, ముప్పాళ్ల, రావులకొల్లు, ఉప్పలదిన్నె, కోటపాడు తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది.

బాలికలు అన్నీ రంగాల్లో రాణించాలి





సైకిల్ తొక్కుతూ విద్యార్థినులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- బేటి బచావో–బేటీ పడావో కార్యక్రమం ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బాలికలు అన్నీ రంగాల్లో రాణించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. ప్రకాశం భవనం వద్ద జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం బేటీ బచావో–బేటీ పడావో ప్రారంభ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సైకిల్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులతో పాటు కలెక్టర్ సైతం సైకిల్ తొక్కి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి విజయవంతం చేయాలన్నారు. బాలికలు ఉన్నతంగా రాణించేందుకు అన్నీ ప్రభుత్వ, ప్రభుత్వయేతర సంస్థలు చొరవ చూపాలన్నారు. ప్రజలు కూడా సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. బాలికలు అభివృద్ధి చెందితే, కుటుంబ వ్యవస్థ తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం విద్యార్థులందరూ మానవహారంగా ఏర్పడి బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్, బాల్య వివాహ రహిత జిల్లా చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ చిన్న ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ హెనసుజన్, బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బినామీ డీలర్ల హవా!

- పశ్చిమ ప్రకాశంలో మొత్తం 523 దుకాణాల్లో 260కి పైగా కూటమి నేతలకు అప్పగింత
- డ్వాక్రా గ్రూపు మహిళల పేరుతో కూటమి నేతల నిర్వహణ
- వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై కొనసాగుతున్న కక్ష సాధింపు
- అన్ని విధాలా సహకరిస్తున్న అధికార యంత్రాంగం



ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని 12 మండలాలతోపాటు మార్కాపురం, గిద్దలూరు, పొదిలి మున్సిపాలిటీలు, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో ఉన్న రేషన్ దుకాణాల్లో బినామీ డీలర్లు హవా కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్న డీలర్లపై టీడీపీ నేతలు అధికారుల ద్వారా ఒత్తిడి చేయించడంతో తట్టుకోలేక పలువురు డీలర్లు రాజీనామా బాట పట్టారు. డివిజన్‌లో మొత్తం 523 రేషన్ దుకాణాలు ఉన్నాయి. గత 7 నెలల్లో రెవెన్యూ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు అక్రమ కేసులు బనాయించడంతోపాటు బెదిరింపులకు పాల్పడటంతో పలువురు డీలర్లు రాజీనామా చేయగా మరి కొంతమందిపై 6ఏ కేసులు నమోదు చేశారు. ఇలా పశ్చిమ ప్రకాశంలో మొత్తం సుమారు 260 రేషన్ షాపులను డ్వాక్రా గ్రూపుల పేరుతో కూటమి నేతలకు అప్పగించారు. మరికొన్ని చోట్ల గ్రామ రెవెన్యూ అధికారులను అడ్డం పెట్టి కూటమి నేతల ద్వారా రేషన్ పంపిణీ చేయిస్తున్నారు.

ఖాళీల భర్తీ ఎప్పుడో?

సుమారు 6 నెలల నుంచి ఖాళీగా ఉన్న రేషన్‌డీలర్ల పోస్టులను భర్తీ చేయకుండా కూటమి ప్రభుత్వం కాలక్షేపం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి నాయకుల కనుసన్నల్లో డ్వాక్రా గ్రూపు లీడర్ల పేరుతో టీడీపీ నాయకులు ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా తమకు ఇష్టమైనవారికి మాత్రమే రేషన్ పంపిణీ చేస్తున్నారు. దీంతో రేషన్ బియ్యం, కందిపప్పు పెద్ద ఎత్తున పక్కదారి పడుతోంది. ప్రభుత్వం కూడా రేషన్ కార్డుదారుల్లో 60 శాతం మందికి మాత్రమే కందిపప్పు అందిస్తోంది. ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులను భర్తీ చేయాల్సిన అధికారులు కాలక్షేపం చేస్తూ డ్వాక్రా సంఘాల పేరుతో టీడీపీ నేతలకు కట్టబెడుతున్నారు. వారు ఆడిందే ఆట.. పాడిందే పాటలాగా.. రేషన్ ఇస్తేనే కార్డుదారులు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేసి డ్వాక్రా మహిళల మాటున టీడీపీ మద్దతుదారులకు రేషన్ షాపులను అధికారులు కట్టబెట్టారు. రికార్డుల్లో మాత్రం పొదుపు సంఘాల పేరుతో ఉండగా, నిర్వహించేది మాత్రం టీడీపీ మద్దతుదారులే కావడం గమనార్హం. రాజీనామా చేసిన డీలర్లు 90 శాతం మంది విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఒత్తిడి తట్టుకోలేక డీలర్‌షిప్‌ను వదులుకున్నారు. దీంతో వినియోగదారులకు రేషన్‌షాపుల ద్వారా సరఫరా చేసే బియ్యం, చక్కెర, కందిపప్పు సక్రమంగా లభించడం లేదు.

ఈ ప్రాంతాల్లో బినామీలే ఎక్కువ

మార్కాపురం నియోజకవర్గంలో వివిధ కారణాలతో కూటమి ప్రభుత్వం రాగానే అధికారుల ఒత్తిడి, బెదిరింపులు తట్టుకోలేక తప్పుకొన్నారు. మార్కాపురం టౌన్, రూరల్‌లో 62 మందికిగాను 50 మంది, తర్లుపాడులో 19 మందికిగాను 11 మంది, కొనకనమిట్లలో 30 మందికిగాను ఐదుగురు, పొదిలిలో 37 మందికిగాను ఐదుగురు, గిద్దలూరులో 202 మందికిగానూ సుమారు 20 మందిని, యర్రగొండపాలెం నియోజకవర్గంలో 173 మందికిగాను 143 మందిని తొలగించారు. వీరి స్థానంలో డ్వాక్రా మహిళల పేరుతో కూటమి నాయకులు, కార్యకర్తలు పెత్తనం చెలాయిస్తున్నారు.

వందేమాతరం శ్రీనివాస్‌కు అక్కినేని అవార్డు

ఒంగోలు మెట్రో: పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర రావు 11వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ కు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అవార్డు–2025ను ప్రదానం చేశారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ లు ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు వందేమాతరం శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. నగరంలోని పలువురు ప్రముఖులు, కవులు, కళాకారులు, సాహిత్య, సంగీత కళాసంస్థల ప్రతినిధులు, అక్కినేని అభిమానులు పాల్గొన్నారు.



వందేమాతరం శ్రీనివాస్‌ను అక్కినేని అవార్డుతో సత్కరిస్తున్న ఎంపీ మాగుంట తదితరులు

ఎయిర్‌పోర్ట్ కోసం స్థల పరిశీలన

కొత్తపట్నం: మండలంలో ఎయిర్‌పోర్ట్ స్థల పరిశీలన కోసం బుధవారం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంట్రల్ టీమ్ వారు బుధవారం పరిశీలించారు. ఆలూరు, అల్లూరు గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్లను పరిశీలించారు. అల్లూరు 1700 నుంచి 1800, ఆలూరు 590 నుంచి 600 వరకు సర్వే నంబర్లలో 657 ఎకరాల పొలాలను పరిశీలించారు. వరదలు ఎంత ఎత్తులో వస్తాయి..వాతావరణం ఎలా ఉంటుంది..ఎప్పుడూ ఎంత ఉష్ణోగ్రత ఉంటుంది.. ఏడాదిలో వర్షపాతం ఎలా ఉంటుంది.. తుఫాన్‌లు ఎలా వస్తాయి, సముద్రం ఎంత దూరంలో ఉందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివరాలన్నీ రాతపూర్వకంగా ఇవ్వాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్నను ఆదేశించారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు మాట్లాడుతూ ఈ సర్వే నంబర్లలో అనుకూలంగా లేకపోతే పక్కకు మార్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందాన్ని కోరారు. ఇవి అన్నీ పూర్తి స్థాయిలో పరిశీలించి ఈ భూమి పనికొస్తుందా పనికిరాదా, లేక పక్కకు మార్చాలా అవి అన్ని పరీక్షలు చేసిన తరువాత నివేదిక పంపుతామని కేంద్రం బృందం స్పష్టం చేశారు. వారివెంట ఎయిర్‌పోర్ట్ టీమ్ జేజీఎమ్ సీఎన్ఎస్, ఏఏఐ ఏఎస్ఎన్ మూర్తి, డీజీఎం ఇంజినీరింగ్ సివిల్ ప్రవింద్ తివారి, ఏ.ఎం.ఏఏఐ ఆర్టికల్చర్ ఆమాన్, ఏజీఎం ఇంజినీరింగ్ సివిల్ అరుణ్ కుమార్, ఏఏఐ మేనేజర్లు షాఅబుల్స్, ఉస్మాన్, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, సర్వేయర్ సుధీర్ తదితరులు ఉన్నారు.



ఎయిర్‌పోర్టుకు స్థలం పరిశీలిస్తున్న కేంద్ర బృందం

విద్యకు అధిక ప్రాధాన్యత

ఒంగోలు వన్‌టౌన్: విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఒంగోలు నగరంలో రూ.6.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బాలికల నూతన వసతి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో మొత్తం రూ.30 కోట్ల వ్యయంతో విద్యార్థుల కోసం వసతి గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఒంగోలు నగరంలోని తూర్పుపాలెంలో ఉన్న బాలుర వసతి గృహాన్ని పాఠశాలకు దగ్గరగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఒంగోలు నగర ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ సంతపేటలో నిర్మించనున్న వసతి గృహంలో 600 మంది విద్యార్థినులకు వసతి కల్పిస్తారన్నారు.కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ లక్ష్మా నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఏపీడబ్ల్యూఐడీసీ ఈఈ భాస్కర్ బాబు పాల్గొన్నారు.

25న బాస్కెట్ బాల్ బాలబాలికల జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వలేటి రవీంద్ర, తొట్టెంపూడి సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపిక జరుగుతుందన్నారు. అండర్ 23 విభాగంలో 2002 జనవరి 1వ తేదీ, ఆ తరువాత పుట్టిన వారు మాత్రమే ఎంపికలో పాల్గొనేందుకు అర్హులు. ఎంపికైన క్రీడా జట్లు ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తమ వెంట తీసుకురావాలి. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 9866126955 లేదా 9963647799లను సంప్రదించవచ్చు.

క్లుప్తంగా


మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

● విద్యుత్ ఎస్ఈకి యూనియన్ నేతల వినతి



ఎస్ఈ వెంకటేశ్వరరావుకు సమస్యలు వివరిస్తున్న మీటర్ రీడర్లు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వరరావుకు యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ భవన్‌లో ఎస్ఈని కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించే విధంగా కాంట్రాక్టర్లను ఆదేశించాలని విన్నవించారు. అలాగే ప్రతి నెలా మొదటి వారంలో వేతనం చెల్లించేలా చూడాలన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్ఈ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. యూనియన్ నాయకులతో మీటింగ్ ఏర్పాటు చేసి తమ పరిధిలోని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వరరావు, యూనియన్ నగర నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కె.సిద్దయ్య, నాగార్జునరెడ్డి, దత్తు, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



● ఆత్మహత్యే శరణ్యమంటున్న రైతులు
● ఐదు నెలలు కావస్తున్నా ఎదగని రొయ్య పిల్లలు
● కొన్ని చెరువుల్లో 2 గ్రాముల రొయ్య పిల్లలను సముద్రానికి వదిలేసిన వైనం
● నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు పలుమార్లు గ్రీవెన్స్‌లో అర్జీలు
● రైతులకు జరగని న్యాయం
● నేడు కలెక్టర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, హేచరీల యజమానులతో సమావేశం



రొయ్యో.. మొర్రో..

నాసిరకం మోనోడాన్ రొయ్య పిల్లలతో రైతులు నాశనం

కొత్తపట్నం: నాసిరకం మోనోడాన్ రొయ్య పిల్లలతో రైతులు నాశనమయ్యారు. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన రొయ్య పిల్లలు రెండు నెలలకే దెబ్బతిన్నాయి. మోనోడాన్ రొయ్య పిల్లల్లో ఈహెచ్‌పీ వైరస్ ఉన్న వాటిని తమకు అంటగట్టారని రైతులు ఆరోపిస్తున్నారు. ఐదు నెలలు కావస్తున్నా రొయ్యలు ఐదు గ్రాముల బరువు కూడా పెరగలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్, ఫీడ్ తదితర ఖర్చులతో భారీగా నష్టం వాటిల్లిందని, ప్రస్తుతం పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి కూడా లేదని, ఇక తమకు ఆత్మహత్యలే శరణ్యమని గగ్గోలు పెడుతున్నారు. మోనోడాన్ రొయ్యల సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు.. మరింత మందిని రొయ్యల సాగుకు దూరం చేశాయి. కొత్తపట్నం మండలంలోని బీరంగుంట, గుండమాల, కొత్తపట్నం, ఈతముక్కల, రాజుపాలెం, పాదర్తి గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. సుమారు 1100 ఎకరాల్లో 6 కోట్ల మోనోడాన్ రొయ్య పిల్లలు వేశారు. ఒక్కో రొయ్య పిల్ల ఒక రూపాయి చొప్పున రైతులు కొనుగోలు చేశారు. అయితే సుమారు 500 ఎకరాల్లో పంట దెబ్బతినడంతో రూ.3 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో పలుమార్లు అర్జీలిచ్చారు. ఎట్టకేలకు గురువారం కలెక్టరేట్‌లో రొయ్యల రైతులు, హేచరీల యజమానులతో నిర్వహిస్తున్న సమావేశంలో న్యాయం జరుగుతుందో లేదో వేచి చూడాల్సిందే.



5 నెలలైనా ఐదు గ్రాములు రాని రొయ్య పిల్లల చెరువులు

సీడ్ ఇచ్చిన తర్వాత సంబంధం లేదు

మోనోడాన్ రొయ్య పిల్లలను కొత్తపట్నం మండలంతోపాటు చినగంజాం పరిసర గ్రామాల రైతులకు కూడా విక్రయించాం. అవి కౌంటింగ్‌కు వచ్చాయి. సీడ్ రైతులకు ఇచ్చిన తర్వాత మాకు ఏ బాధ్యత ఉండదు. ఒక్కో ప్రాంతంలో చెరువుల స్వభావం, వాతావరణాన్ని బట్టి మార్పులు సంభవిస్తుంటాయి. గురువారం కలెక్టర్ సమక్షంలో జరిగే సమావేశంలో చర్చించి వారికి ఏమి చేయాలో ఆలోచిస్తాం.

– రాజశేఖర్, మున్నంగి హేచరీ యజమాని

నష్ట పరిహారం ఇప్పించాలి



నేను చాలా చిన్న రైతును. లక్ష మోనోడాన్ రొయ్య పిల్లలను 2024 సెప్టెంబర్ 12న కొనుగోలు చేశా. రెండు నెలలకే చనిపోవడంతో సముద్రానికి వదిలేశా. రూ.7 లక్షల పెట్టుబడి నష్టం వచ్చింది. అధికారులు పరిశీలించి నష్ట పరిహారం ఇప్పించాలని కోరుకుంటున్నా.

– బి.వందనం, మోటుమాల



మున్నంగి హేచరీ నుంచి మోనోడాన్ రొయ్య పిల్లలు కొనుగోలు చేసిన రశీదులు

ఒక్క చెరువు కూడా మిగల్లేదు



మున్నంగి హేచరీ యాజమాన్యం నాసిరకం రొయ్య పిల్లలు అంటగట్టింది. 10 లక్షల మోనోడాన్ రొయ్య పిల్లలను 2024 సెప్టెంబర్ 12న పది చెరువుల్లో వదిలాను. రెండు గ్రాములు పెరిగాక అన్నీ చనిపోయాయి. ఇక్క చెరువు కూడా మిగలేకలదు. రూ.40 లక్షలు పెట్టుబడి నీళ్ల పాలయింది. రెండుసార్లు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చా. గురువారం కలెక్టర్ నిర్వహించే సమావేశంలోనైనా న్యాయం చేయాలని వేడుకుంటున్నా.

– మూగా వెంకటేశ్వర్లు, పాదర్తి

రూ.50 లక్షలు నష్టపోయా



నేను మున్నంగి హేచరీలో 2024 సెప్టెంబర్ 7న 2 లక్షలు, సెప్టెంబర్ 12న 6.30 లక్షలు, సెప్టెంబర్ 13న 3.60 లక్షల మోనోడాన్ రొయ్య పిల్లలు కొనుగోలు చేసి 12 చెరువుల్లో వదిలా. పది చెరువుల్లో రొయ్య పిల్లలు రెండు గ్రాములు వచ్చిన తర్వాత చనిపోయాయి. వాటిని సముద్రానికి వదిలేశా. రెండు చెరువులను మాత్రం ఐదు నెలలుగా అలాగే ఉంచా. ఈ ఐదు నెలల్లో 5 గ్రాములు మాత్రమే పెరిగాయి. మొత్తం రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టా. నాసిరకం రొయ్య పిల్లలు అంటగట్టడం వల్ల తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యా. రెండుసార్లు కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో అర్జీలు ఇచ్చా. కలెక్టర్ స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నా.

– పురిణి కృష్ణారెడ్డి, మోటుమాల

కూలీల ఆటో బోల్తా



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

● డ్రైవర్ మృతి, నలుగురికి స్వల్ప గాయాలు

పామూరు: కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బొట్లగూడూరు బలిజపాలెం రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కథనం మేరకు.. మండలంలోని పుట్టంనాయునిపల్లె గ్రామానికి చెందిన మేడిద రమణయ్య(38) తన ఆటోలో కూలీలను ఎక్కించుకుని పీసీపల్లి మండలం మెట్లవారిపాలెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని బొట్లగూడూరు గ్రామం దాటిన తర్వాత ఒక్కసారిగా ఆటో ఇంజన్ సీజ్ కావడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆటోను నడుపుతున్న మేడిద రమణయ్య తలకు ఇనుప రాడ్లు బలంగా తగిలాయి. ఆటోలోని మరో నలుగురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడు రమణయ్యను పామూరు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య ప్రసన్న, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమణయ్య అకాల మృతితో భార్య ప్రసన్న, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు.

అనుమానమే లేదు.. చంపేశారు!

● ఆనంద్ హంతకులను కఠినంగా శిక్షించాలని బంధువుల డిమాండ్
● దర్యాప్తులో పోలీసులు జాప్యం చేస్తున్నారని ఆరోపణ
● కేఎస్ పల్లెలో నంద్యాల హైవేపై చిల్లకంప వేసి రాస్తారోకో
● పోస్టుమార్టం నివేదిక ప్రకారం చర్యలుంటాయన్న సీఐ

గిద్దలూరు రూరల్: తమ పిల్లవాడిని అన్యాయంగా చంపేసిన నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కె.ఎస్.పల్లె ఎస్సీపాలేనికి చెందిన వారు బుధవారం నంద్యాల హైవే రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. గత ఏడాది అక్టోబర్ 28వ తేదీన గడ్డం ఆనంద్(19) అనే యువకుడు పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల వెనుక నీటి కుంటలో మృతి చెందిన విషయం తెలిసిందే. పోస్టుమార్టం నివేదిక రావాల్సి ఉందని పోలీసులు చెబుతుండగా.. దర్యాప్తులో జాప్యం చేస్తున్నారని, నిందితులను పట్టుకుని శిక్షించాల్సిందేనంటూ మృతుడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై సోమవారం రాత్రి గిద్దలూరు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన మృతుడి బంధువులు.. బుధవారం మరోమారు స్వగ్రామం కేఎస్ పల్లెలో నంద్యాల హైవేపై చిల్లకంప వేసి ధర్నా చేపట్టారు. ఆనంద్‌ను స్నేహితులే హత్య చేసి నీటి కుంటలో పడేశారని, దర్యాప్తు ఆ దిశగా సాగలేదని ఆరోపించారు. పోలీసులు జాప్యం చేయడం తగదంటూ నినాదాలు చేశారు. ధర్నాతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో గిద్దలూరు టౌన్ సీఐ కె.సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. పోస్టుమార్టం రిపోర్టును తమ సమక్షంలోనే చదివి, దాని ఆధారంగానే తదుపరి దర్యాప్తు చేస్తామని శాంతిపజేయడంతో ఆందోళన విరమించారు.



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న ఆనంద్ బంధువులు

వెలుగొండ జలాల సాధన సదస్సు నేడు

కనిగిరి రూరల్: వెలుగొండ జలాల సాధన సదస్సు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కనిగిరిలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు తెలిపారు. ఈ సదస్సుకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరవుతున్నట్లు చెప్పారు. తొలుత మధ్యాహ్నం 2 గంటలకు రీ మోడల్ చేసిన కనిగిరి సుందరయ్య భవన్ ప్రారంభం, ఆ తర్వాత 2.30 కనిగిరి ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక సుగుణావతమ్మ సెంటర్‌లో(క్లబ్ రోడ్డు) మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే వెలుగొండ జలాల సాధన సదస్సు సభలో బీవీ రాఘవులు ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు.

వ్యవహారిక భాషోద్యమ వైతాళికుడు గిడుగు

ఒంగోలు మెట్రో: వ్యవహారిక భాషోద్యమ పితామహుడిగా సాహిత్య వ్యాసంగంలోనూ, నూతన విద్యా రంగంలోనూ తనదైన ముద్ర వేశారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ కొనియాడారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా గ్రంథాలయంలో ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు 85వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ప్ర.ర.సం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ.. వాడుక భాషోద్యమానికి సారథ్యం వహించిన గిడుగు రామమూర్తి, గ్రాంథిక భాషావాదులపై విజయాన్ని సాధించారన్నారు. వ్యవహారిక భాష గొప్పదనాన్ని డా.నూనె అంకమ్మరావు, సంస్థ కార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు వివరించారు. విశిష్ట అతిథి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. పుట్టుకతోనే కొందరు, పరిస్థితుల ప్రభావం వల్ల మరికొందరు గొప్పవారు అవుతారని, గిడుగు మాత్రం స్వయంకృషితోనే వ్యవహారిక భాషోద్యమ పితామహుడయ్యారని కితాబిచ్చారు. న.ర.సం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి మాట్లాడుతూ.. 'వ్యవహారిక భాష తల్లివలె నాకు ప్రేమ పాత్రం, ప్రాచీనాంధ్ర భాష మూలపుటమ్మ వలె నాకు పూజ్యురాలు' అని రామమూర్తి మాటల్ని ఉటంకించారు. తొలుత గిడుగు చిత్రపటానికి సాహితీవేత్తలు ఘన నివాళులర్పించారు. యువ కవయిత్రులు బండారు సునీత, ఎస్.నాంచారమ్మ, బాపట్ల రేఖ, యువకవి కందుల మధును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిడసల మల్లికార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పూర్వ చైర్ పర్సన్ చెరుకూరి భారతి, బొమ్మరిల్లు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు. నూకతోటి శరత్ బాబు, బీరం అరుణ, ఓరుగంటి ప్రసాద్, విశ్రాంత సంయుక్త కలెక్టర్ పి.పేరయ్య, ధేనువకొండ సుబ్బారావు, నర్సింగోలు శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



యువ కవయిత్రులను సన్మానిస్తున్న నిర్వాహకులు

రియో.. నేనేరా పుష్పా..!

కనిగిరి రూరల్: కనిగిరి పట్టణంలోని పాతూరులో బుధవారం ఓ కాటికాపరి పూటుగా మద్యం సేవించి హల్‌చల్ చేశాడు. రోడ్డుపై చక్కర్లు కొడుతూ కత్తితో చేతికి గాయం చేసుకున్నాడు. అదే కత్తిని నోట కరుచుకుని.. 'నేనే పుష్పా.. ఇది నా బ్రాండ్' అంటూ కొద్ది సేపు వీరంగం చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



కత్తిని నోట కరుచుకున్న మందుబాబు

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

● రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభం
● కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ నుంచి నగరంలో వాక్ థాన్ ప్రారంభం



వాక్‌థాన్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఎస్పీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

ఒంగోలు సబర్బన్: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని ఒంగోలు నగరంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద కళాశాల విద్యార్థులతో ప్రారంభించిన వాక్ థాన్‌ను మంత్రి స్వామి జెండా ఊపి ప్రారంభించారు. నగరంలో రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జరిగే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్‌లు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, అతివేగంగా వాహనం నడిపితే అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు.

ఎస్పీ ఏఆర్ దమోదర్ మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను, స్కూల్ పిల్లలను తరలించరాదన్నారు. రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రతి సంవత్సరం చాలా మంది వాహనదారులు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ ఇతర ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. భయంకరమైన సౌండ్స్ వచ్చే మాడిఫైడ్ సైలెన్సర్‌లు అమర్చి ఇతర వాహనదారులకు భయాందోళనలు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు, తాలూకా సీఐ అజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సైలు, ఇతర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
● కలెక్టర్‌తో కలిసి కలెక్టరేట్ సమీక్షించిన మంత్రి స్వామి

ఒంగోలు అర్బన్: సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆ మేరకు విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ, వైద్య ఆరోగ్యం, తాగునీటి సరఫరాల శాఖలతో కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి బుధవారం సమీక్షించారు. దీనిలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద పిల్లలు చదువుకుంటున్న సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో, ఉత్తమ పరీక్ష ఫలితాలు సాధించడంలో అలసత్వం లేకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. హాస్టళ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.143 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. హాస్టళ్లలో విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయాలని స్పష్టం చేశారు. ఖాళీలు ఉన్న చోట విద్యార్థుల సమాజిక తరగతితో సంబంధం లేకుండా అడ్మిషన్లు మంజూరు చేయాలన్నారు. దివ్యాంగులైన విద్యార్థుల పెన్షన్ల కోసం ప్రతి నెలా వారి స్వగ్రామాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో పెన్షన్ డబ్బు వారి ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. జిల్లాలోని ఆస్పత్రిల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మాతా శిశు మరణాలు తగ్గించాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని సూచించారు. గుండెపోటు వచ్చినప్పుడు తక్షణమే ప్రమాదాన్ని నివారించేందుకు ఇంజక్షన్ వేసే స్టెమీప్రాసెస్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సాగర్ జలాలను మరో విడత విడుదల చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల సమస్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కో ఆర్డినేటర్ జయ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ప్రాజెక్టు ఎస్ఈ బాలమురళీమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, రిమ్స్ సూపరింటెండెంట్ జమున, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి, ఎంపీ, కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు